క్లుప్తంగా

హనుమాన్ జయంతి రేపు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కం డ్రిగ గ్రామ సమీపంలోని అరుణగిరిపై ఉన్న కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. అదేవిధంగా మాకమాంబాపురం గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు వాహనాల వేలం

గంగాధరనెల్లూరు: పలు కేసుల్లో పట్టుబడిన 11 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు గంగాధరనెల్లూరు సీఐ మారుతి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ శంకర్ మాట్లాడుతూ గంగాధరనెల్లూరు పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడిన 11 బైక్‌లను శుక్రవారం ఉదయం అధికారుల ఆధ్వర్యంలో 10 గంటలకు వేలం వేయనున్నట్లు, ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఘనంగా గంగమ్మ జాతర



అలంకరణలో గంగమ్మదేవి

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో గురువారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. మధ్యాహ్నం అమ్మవారిని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీకోదండరామస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో జూన్ నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జూన్ 1, 8, 15, 22, 29వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామలక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. 6వ తేదీ అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం చేపడుతారు. ఇదే రోజు రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ జరుగనుంది. 9వ తేదీన పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయంలో ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళుతారు. సాయంత్రం 6.30 గంటలకు అక్కడ స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 22వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం జరుగనుంది. ఇదే రోజు సాయంత్రం 6.30 గంటలకు అక్కడ స్వామివారికి ఆస్థానం నిర్వహిస్తారు.

2 నుంచి శ్రీచంద్రమౌళీశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): రిషికేష్ ఆంధ్ర ఆశ్రమంలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామివారి ఆలయంలో జూన్ 2 నుంచి 6వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. జూన్ 1వ తేదీ సాయంత్రం అంకురార్పణ, మూషిక వాహనసేవ నిర్వహిస్తారని పేర్కొన్నారు. జూన్ 2న ఉదయం ధ్వజారోహణం, కల్పవృక్ష వాహనం, సాయంత్రం హంస వాహనం, 3న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 4న ఉదయం శేషవాహనం, సాయంత్రం గజవాహనం, 5న ఉదయం సింహ వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, వృషభ వాహనం, 6న ఉదయం త్రిశూల స్నానం, తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాల సాహిత్య సమ్మేళనంలో తిరుపతి రచయితలు

తిరుపతి కల్చరల్: తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో బాలల రచనలు రాస్తున్న ఆర్‌సీ కృష్ణస్వామిరాజు, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల్లో బాల సాహిత్య కథలు, గేయాలు రాయిస్తూ బాలల నేస్తం మాసపత్రికను నిర్వహిస్తున్న బాల సాహితీ రచయితలు డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి తిరుపతి జిల్లా నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల వికాసాభివృద్ధికి కృషి చేస్తున్న వారికి తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, నిర్వాహకుడు గరికపల్లి అశోక్ వారి కృషిని అభినందిస్తూ ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించి, అభినందించారు.

అతివకు ఆదాయ మెట్టు



- విజయపథాన జగనన్న మహిళా మార్టు
- చౌకగా, నాణ్యతతో కూడిన అన్ని వస్తువులు ఒకేచోట లభ్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

ప్రస్తుత ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని కూడా మహిళలకు పెద్దపీట వేస్తూ వచ్చింది. అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించిన ప్రభుత్వం మహిళా మార్టుల పేరిట వ్యాపార రంగంలోకి తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళా మార్టులు ప్రారంభం కాగా, ఇటీవల పుత్తూరులో మార్టు ప్రారంభమైంది. ఇది ప్రారంభమైన తొలి నెలలోనే రూ.19 లక్షల అమ్మకాలు జరగడంతో మహిళా సంఘ సభ్యుల్లో ఆత్మస్థైర్యం నిండింది. మార్టు విజయపథంలో పయనిస్తోంది.



జగనన్న మహిళా మార్టు



మార్టులో సరుకులు కొనుగోలు చేస్తున్న మహిళలు

పుత్తూరు: ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో వీరిని వ్యాపార రంగంపైపు పయనింపజేసింది. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా వెలుస్తున్న మహిళా మార్టుల్లో భాగంగా ఇటీవలే పుత్తూరులో 13వ మహిళా మార్టును మంత్రి ఆర్కే రోజా ప్రారంభించిన విషయం విదితమే. స్థానిక కావమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఈ జగనన్న మహిళా మార్టులో పుత్తూరు పట్టణ పరిధిలోని 1,047 స్వయం సహాయక సంఘాలలోని 10,120 మంది మహిళా సభ్యులు ఈ మార్టుకు యజమానులు. ఒక్కొక్కరి పెట్టుబడి కేవలం రూ.150 మాత్రమే. అయినా మొత్తం పెట్టుబడి రూ.15.18 లక్షలు. తొమ్మిది మంది మహిళా మహిళా సభ్యులు వివిధ హోదాల్లో మార్టు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అయితే నేటి పోటీ వ్యాపార ప్రపంచంలో తట్టుకుని నిలబడాలంటే తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందిస్తున్నారు. ఫలితంగా వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోంది.

ఇద్దరూ వారే..

మహిళా మార్టు విజయపథాన పయనించడానికి మార్టు యజమానులు, పనిచేసే సిబ్బందితో పాటు వినియోగదారులు సైతం స్వయం సహాయక సభ్యులైన మహిళలే కావడం ప్రధాన కారణం. అంతేకాకుండా మార్కెట్‌లో లభించే ధరలకంటే తక్కువ ధరకు, నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందించేలా సిబ్బంది పక్కా ప్రణాళికతో వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఫలితంగా మార్టు ప్రారంభమైన తొలి నెలలోనే రూ.19 లక్షల అమ్మకాలు చేయడం సభ్యుల చిత్తశుద్ధికి నిదర్శనం. ఇలా డ్వాక్రా మహిళల సహకారంతో పాటు అధికారుల పర్యవేక్షణతో పుత్తూరులోని మహిళా మార్టు విజయవంతంగా నడుస్తోంది. రానున్న రోజుల్లో మార్టు వ్యాపారం కోట్లకు ఎగబాకుతుందనడంలో సందేహం లేదు.

మార్టు వివరాలు..		
సభ్యుల సంఖ్య	-	10,120
ఒక్కొక్కరి పెట్టుబడి	-	రూ.150
మొత్తం పెట్టుబడి	-	రూ.15.18 లక్షలు
రోజువారి అమ్మకాలు	-	రూ.63 వేలు
నిర్వహణా సిబ్బంది		
మేనేజర్	:	1
క్యాషియర్స్	:	2
ఎక్స్‌క్యూటివ్ మెంబర్స్	:	4
స్వీపర్	:	1
నైట్ వాచ్‌మెన్	:	1
మొత్తం	:	9

ఆర్థికాభివృద్ధికి దోహదం



మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి మార్ట్‌లు దోహదపడతాయి. సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను సైతం మార్టులో ఉంచి విక్రయిస్తున్నాం. దీంతో సభ్యులు తమ ఉత్పత్తులను మరింత పెంచుతున్నారు. ఈ విధంగా సభ్యులకు మరింత లాభాలు వచ్చే అవకాశం ఉంది.

–ఎంపీ స్వాతి, సంఘ సభ్యురాలు, తాయిమాంబాపురం

10 శాతం ధర తక్కువకే..



మహిళా మార్టులో అందుబాటులో ఉన్న ప్రతి వస్తువు నాణ్యత బాగుంది. బయటి ధరల కన్నా 10 శాతం తక్కువకు లభించడం సంతోషకర విషయం. దాదాపు అన్ని వస్తువులు అందుబాటులో ఉన్నాయి. అందుకే మార్టులోనే అన్నీ వస్తువులను కొనుగోలు చేస్తున్నాం.

–ఎ.హేమావతి, వినియోగదారురాలు, పుత్తూరు

బ్యాంకు ఖాతాల్లోకి పింఛన్లు

పుత్తూరు: జూన్ నెల పింఛన్లను 1వ తేదీనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే లబ్ధిదారుల ఆధార్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. విభిన్న దివ్యాంగ లబ్ధిదారులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధ వీరుల వృద్ధ వితంతువులకు మాత్రం గత నెలలో ఇచ్చిన విధంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తారని వెల్లడించారు. పింఛనుదారులు సచివాలయాల వద్దకు తిరగవద్దని, అనవసరంగా ఆందోళన పడవద్దని ఆయన కోరారు.

తోట సుమతికి బంగారు నంది అవార్డు



ప్రముఖ దర్శకుడు కృష్ణారెడ్డి చేతుల మీదుగా నంది అవార్డు అందుకుంటున్న సుమతి

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగిని తోట సుమతికి గాన కళా సేవారంగంలో అత్యుత్తమ సేవలందించినందుకు ప్రతిఫలంగా బంగారు నంది అవార్డును ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వారా ప్రముఖ సినిమా దర్శకుడు, నటుడు కృష్ణారెడ్డి బహూకరించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన గాన పోటీల్లో ప్రతిభ కనబరిచినందుకు సుమతికి బంగారు నంది మెమెంటోతో పాటు ప్రశంసాపత్రాన్ని సైతం అందించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభ కనబరచిన సుమతిని పలువురు స్థానికులు ప్రశంసించారు.

నాణ్యమైన భోజనం అందించడమే ధ్యేయం





మాట్లాడుతున్న ఎంఈఓ విజయకుమార్, శిక్షణా కార్యక్రమానికి హాజరైన వంట కార్మికులు

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రతి రోజు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో కేంద్రప్రభుత్వ ప్రధానమంత్రి పోషణ్ పథకం ఆధ్వర్యంలో పాఠశాలలోని వంట కార్మికులకు ఒక్కరోజు శిక్షణా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన విందు భోజనం వడ్డించడానికి వంట కార్మికులకు శిక్షణ కల్పించడం జరుగతుందన్నారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేకమైన పోర్ట్‌ఫైడ్ బియ్యం అందించడం జరుగుతుందని, అలాగే చిక్కీ, కోడిగుడ్డు వంటి పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందన్నారు. వంట కార్మికులు కూడా పరిశుభ్రతను కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ(2) మనోజ్‌కుమార్, రీసోర్స్ పర్సన్ షాహీనా, ఎమ్మార్సీ సిబ్బంది, వంట కార్మికులు పలువురు పాల్గొన్నారు.

బుగ్గ ఆలయాన్ని కాపాడండి



మాట్లాడుతున్న రిటైర్డ్ టీచర్ రఘునాథ ఆచారి

తిరుపతి కల్చరల్: ఎంతో పవిత్రమైన, పురాతనమైన నగరి మండలంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుగ్గ ఆలయంలో జరుగుతున్న అన్యాయాలను అరికట్టి ఆ ఆలయాన్ని కాపాడాలని నింద్ర మండలం, నెట్టేరి గ్రామానికి చెందిన భక్తుడు, రిటైర్డ్ టీచర్ పి.రఘునాథ ఆచారి విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆలయానికి విచ్చేసే భక్తులపై ఆలయ అర్చకుడు కుప్పయ్య హేళనగా మాట్లాడుతూ తూలనాడుతున్నారన్నారు. అర్చకుడు నాలుగు నెలలుగా విధులకు హాజరు కాకుండా ఎలాంటి మెడికల్ సెలవు లేకుండా తన ఇంటి వద్దకే హాజరు పట్టీ తెప్పించి డ్యూటీకి హాజరైనట్లు సంతకాలు చేసి జీతం తీసుకుంటున్నారని ఆరోపించారు. భక్తులు ఆలయానికి అందించే విరాళానికి కూడా రశీదు ఇవ్వకుండా ఆ సొమ్ములు ఆలయానికి ఖర్చు చేయకుండా స్వాహా చేస్తున్నారని తెలిపారు. ఆలయం వద్ద టాయిలెట్స్‌ను శుభ్రం చేసే కార్మికుడు నాగయ్యకు జీతంగా ఆయన అకౌంట్‌లో పది వేలు పడితే మరుసటి రోజే తన మనుషులను నాగయ్య ఇంటికి పంపి జీతం డబ్బులలో రూ.5 వేలు లాగేసుకుంటున్నారని తెలిపారు.

పుత్తూరులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి



నగరం రోడ్డులో ఆక్రమణలను దృశ్యం

పుత్తూరు: పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులోని ఆక్రమణలను గురువారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నగరం రోడ్డులోని డ్రైనేజీని పూర్తిగా ఆక్రమించి దుకాణాలు వెలిశాయన్నారు. పట్టణ జనాభా పెరిగిన నేపథ్యంలో మురుగునీరు, వర్షపునీరు పోవడానికి అనుగుణంగా డ్రైనేజీని పునఃనిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూ.8 లక్షలతో చేపట్టిన పనుల నిమిత్తం ఆక్రమణలను తొలగించినట్లు స్పష్టం చేశారు.

పూల దుకాణాలు, ఆటోస్టాండ్ ఖాళీ చేయాలి..

నగరం రోడ్డులో వన్‌వే ఏర్పాటు చేయడంలో భాగంగా రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న పూల దుకాణాలను, అలాగే ఆటోస్టాండ్ సైతం పోలీసుల సహకారంతో ఖాళీ చేయించనున్నట్లు తెలిపారు. శుక్రవారం నాటికి పూల దుకాణాలు, ఆటోస్టాండ్ స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. డ్రైనేజీలపై ఎవరైనా ఎటువంటి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పట్టణంలో ఆక్రమణలను దుకాణదారులు స్వచ్ఛందంగా తొలగించాలని లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.

వైభవంగా చండీ సప్తశతి హోమ పూజలు



చండీహోమం నిర్వహిస్తున్న పండితులు



కలశాలకు పూజలు చేస్తున్న పండితులు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

నగరి: మండలంలోని బుగ్గ అగ్రహారం శ్రీ వన్నూరమ్మ ఆలయంలో చండీసప్తశతి హోమపూజలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చండీహోమం, శ్రీఖడ్గమాల హోమం, కామ్యర్థ హోమం, యోగినిబలి, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణలు గ్రామమంతా వినిపించాయి. హోమపూజల అనంతరం ధూప, దీప నైవేద్యం, తీర్థప్రసాదాల వినియోగం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హోమపూజలను వీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. మొగిలి, దేవవరకొండ శివపార్వతుల గోశాల నిర్వాహకులు జ్యోతిష్య జ్ఞానరత్న పాణ్యం శ్రీనివాస శర్మ ఈ యాగపూజలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హోమపూజల నిర్వహణలో పురాణం దుర్గాప్రసాద్ శర్మ, నవీన్‌కుమార్ శర్మ, మహేశ్ శర్మ, బ్రహ్మశ్రీ తిప్పావఝల శ్రీకాంత్ శర్మ, నిభణపూడి ఉదయకుమార్ శర్మ, నవీన్ కుమార్ శర్మ సహకారం అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూజాలి వెంకటరెడ్డి, కుమారస్వామి, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం



మాట్లాడుతున్న సీఐ సత్యబాబు, ఎస్ఐ భారతి

పాలసముద్రం: సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు గెలిచినా బాణసంచాలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధమని సీఐ సత్యబాబు, ఎస్ఐ భారతి తెలిపారు. గురువారం పాలసముద్రం దళితవాడలో ఓట్ల లెక్కింపు రోజు శాంతి భద్రతలు, కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. సీఎం సత్యబాబు మాట్లాడుతూ వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్ రోజు శాంతి భద్రతల సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు ముగిసిన 48 గంటల వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించరాదన్నారు. అనంతరం ఏడు బైక్‌లు, ఒక ఆటోను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మురుగేష్, చక్రవర్తి, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

వసంతోత్సవంలో కల్యాణ వెంకన్న



వసంతోత్సవంలో ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి గురువారం సాయంత్రం స్వామివారు శ్రీదేవీ, భూదేవీ సమేతుడై వసంతోత్సవంలో పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకున్న భక్తులపై పరిచారకులు సుగంధ పరిమల ద్రవ్యాన్ని చిలకరించారు. బ్రహ్మోత్సవాల ధ్వజావరోహణమైన మరుసటి రోజు సాయంత్రం వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజలు, గంట, నైవేద్యం తదితర కార్యక్రమాలను పూర్తి చేశారు. సాయంత్రం శ్రీవారు ఉభయ నాంచారులతో తెల్లటి పట్టువస్త్రాలను, స్వర్ణాభరణాలను, సుగంధ పుష్ప మాలికలు అలంకరించుకుని తిరుచ్చి వాహనంపై అధిష్టించారు. మాడవీధుల్లో భక్తులు, మహిళలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి పరిచారకులు తిరుచూర్ణ, సుగంధ ద్రవ్యాల మిశ్రమాన్ని అందరిపై చల్లారు. ఆలయానికి చేరుకున్న దేవరలకు ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్జిత అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తదితరులు పర్యవేక్షించారు.

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం





వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు, వీడియోల ద్వారా వంటకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికర భోజనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఈఓ తిరుమలరాజు తెలిపారు. గురువారం పుత్తూరు మండలం ఎగువకనకంపాళెం మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన తయారీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలోని మెనూ వివరాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేశారు. ప్రత్యేకించి తాజ్ హోటల్ వంట నిపుణుల వీడియోలను ప్రదర్శించి వంట సిబ్బందికి అవగాహన కల్పించారు. 100 శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేటట్లు ప్రోత్సహించాలని సూచించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం రోజు నుంచే మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించాలని స్పష్టం చేశారు. అనంతరం వంట సిబ్బందికి పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో ఎగువకనకంపాళెం, ద్వితీయస్థానంలో వేణుగోపాలపురం, తృతీయ స్థానంలో పైడిపల్లి పాఠశాలల సిబ్బంది కైవసం చేసుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలసుబ్రమణ్యం, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.